ప్రహసనంగా శ్రీవారి ట్రస్ట్ బోర్డు నియామకం

- అధికారిక కార్యక్రమాల్లో అప్రకటిత ఛైర్‌పర్సన్ రమాదేవి
- సభ్యులుగా మరికొందరికి ఎమ్మెల్యే ఆశీస్సులు
- తీరుబడిగా ఇప్పుడు దరఖాస్తుల ఆహ్వానం
- ధ్వజమెత్తుతున్న ఆశావహులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆలయాల్లోకి రాజకీయాలు ప్రవేశించాయి. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసిన కొందరు స్థానిక చోటా నాయకులకు ప్రస్తుతం నామినేటెడ్ పదవులు కేటాయించే దిశగా కూటమి పార్టీల నాయకులు చర్యలు చేపట్టారు. ఏలూరు నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రతి ఏటా దాదాపు రూ.90 లక్షలకు పైగా ఆదాయం సముపార్జించుకుంటూ భక్తులకు సేవలందిస్తూ, స్వామి వారి వార్షిక ఉత్సవాలు నిర్వహిస్తూ అలరారుతోంది. ఈ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పదవికి ఎప్పుడూ విపరీతమైన పోటీ ఉంటుంది. అయితే స్థానిక ఎమ్మెల్యే ఆశీస్సులు ఎవరికి ఉంటే వారికే ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పదవి లభిస్తుంది. ఈ ఆలయానికి ఎన్నికలకు ముందు పని చేసిన ట్రస్ట్ బోర్డు గడువు ముగిసిపోయింది. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తుండగా ఇప్పటికి నూతన ట్రస్టబోర్డు ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే ఈ చర్యలు ఒక ప్రహసనంలా సాగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ట్రస్టబోర్డు సభ్యులుగా నగరంలోని కొందరు కార్పొరేటర్ల భార్యలకు, వార్డు నాయకుల భార్యలకు ఎమ్మెల్యే ఆశీస్సులు లభించినట్టు ప్రచారం జరుగుతోంది.





ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి మూలవిరాట్, దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటుచేసిన ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్‌గా ఫ్లెక్సీ

అప్రకటిత చైర్మన్‌కు ప్రోటోకాల్

ఈ దేవస్థానం ట్రస్టబోర్డు చైర్మన్‌గా మాజీ ఎంపీ మాగంటి బాబు వియ్యపురాలు, నగరానికి చెందిన వ్యాపారవేత్త పొలదుగు రాజేంద్రప్రసాద్ సతీమణి వెంకట రమాదేవికి అవకాశం కల్పిస్తానని ఎమ్మెల్యే స్పష్టమైన హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే ఆశీస్సులు అందుకున్న నాటి నుంచి రమాదేవి శ్రీ వారి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రతి అధికారిక కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రోటోకాల్ పాటిస్తున్నారు. దీనిపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రమాదేవి చైర్మన్‌గా ప్రకటించేసుకున్నారు.

లేఖలు ఇచ్చారు.. దరఖాస్తులు కోరుతున్నారు !

ఈ ఆలయానికి ఇప్పటికే చైర్మన్ అభ్యర్థినికి ఖరారు చేయగా, మరి కొందరికి బోర్డు సభ్యులుగా అవకాశం ఇవ్వడానికి ఎమ్మెల్యే లేఖలు కూడా ఇచ్చినట్టు తెలుస్తోంది. ఐనా అధికారులు ఇప్పుడు తీరుబడిగా ట్రస్టబోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ నెల 13న ఆలయ కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. నిబంధనల ప్రకారం ఈ ఆలయానికి 11 మందిని (ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆలయ అర్చకునితో కలిపి) ట్రస్ట్ బోర్డులో నియమించే అవకాశం ఉంది. వారిలో 50 శాతం మంది మహిళలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు కలిపి ఆరు స్థానాలు రిజర్వ్ చేయబడి ఉంటాయి. సభ్యుల్లో ఒక బ్రాహ్మణ, ఒక నాయీ బ్రాహ్మణ వ్యక్తికి కూడా తప్పనిసరిగా స్థానం కల్పించాలనే నిబంధన కొత్తగా చేర్చారు. సభ్యులుగా అవకాశం కల్పించే వారిలో ఆలయానికి సంబంధించిన ఒక దాతకు తప్పనిసరిగా స్థానం కల్పించాల్సి ఉంటుంది. అందరూ 30 సంవత్సరాల వయసు పైబడిన హిందువులై ఉండాలి, వారిపై ఎటువంటి పోలీసు కేసులూ నమోదై ఉండకూడదు. సభ్యుల్లో వ్యసనపరులు ఉండరాదు.



ఇటీవల శ్రీవారి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు తీసుకొచ్చిన అప్రకటిత చైర్మన్ రమాదేవి దంపతులు

ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించిన శ్రీవారి 36వ వార్షిక సుదర్శన కలశ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవాల కరపత్రాల్లో ఆమె పేరును ముద్రించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయరు స్వామి రాక సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతూ ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటుచేసిన అతి పెద్ద ఫ్లెక్సీలో చైర్మన్ హోదాలో రమాదేవి పేరు వేయడం చర్చనీయాంశమైంది.

ధ్వజమెత్తుతున్న ఆశావహులు..

స్వామి వారికి సేవ చేసే భాగ్యం దొరుకుతుందని ఆశావహులు భావించారు. వారిలో కొందరు స్వామి వారి ఆలయానికి అనేక విధాలుగా విరాళాలు సమర్పించిన వారూ ఉన్నారు. అయితే ఇప్పటికే చైర్మన్ పదవికి ఒకరిని సిఫార్సు చేయడంతో పాటు మరి కొందరికి సభ్యులుగా అవకాశం కల్పించడానికి ఏర్పాట్లు జరిగిపోయాయని సమాచారం అందడంతో ఆశావహులు భగ్గుమంటున్నారు. ట్రస్టబోర్డులో స్థానం కోసం టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా పోటీ పడుతున్నారు.

క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఆదివారపు పేట శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిరం ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు పేర్కొన్నారు. బాబా మందిరం వద్ద ఆయన ఆధ్వర్యంలో సాయి మహిళా భక్తుల సహకారంతో మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. భక్తులకు, సంచారుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామని తాతారావు తెలిపారు. ప్రతి గురువారం మజ్జిగ చలివేంద్రం కొనసాగుతుందన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఈడ) చైర్మన్‌గా ఎన్నికైన పెద్దిబోయిన వాణి వెంకట శివప్రసాద్‌ని సాయి ప్రేమ మందిర్ సేవకుల ఆధ్వర్యంలో సత్కరించారు. వాణి వెంకట శివప్రసాద్ ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇంగ్లిష్ భాషపై ఆసక్తి పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజనేయులు

ఏలూరు (టూటౌన్): ఇంగ్లిష్ భాష నేర్చుకోవాలనుకునే వారు దానిపై అభిమానం, ఆసక్తి పెంచుకోవాలని సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ పి.అంజనేయులు సూచించారు. పవర్‌పేటలోని అన్నే భవన్‌లో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగిష్ ట్రైనింగ్ సెంటర్‌ను అంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. భాషను సమయస్ఫూర్తిగా వినియోగించగలడం నేర్చుకోవాలన్నారు. ఏవీఆర్ జ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 31 వరకు కొనసాగే శిక్షణ శిబిరాన్ని 10వ తరగతి, ఆ పైన చదివే విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్ కేవీ నారాయణరావు ఇంగ్లిష్‌లో కొన్ని వాక్యాలను మాట్లాడటం నేర్పించారు. కార్యక్రమాన్ని విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎమ్మెస్ ఎస్ లక్ష్మి, కొమోజి శ్రీనివాసరావు సమన్వయం చేశారు.

దత్తాత్రేయ స్వామికి అభిషేకం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో శ్రీదత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేసవి విజ్ఞాన శిబిరాల్లో కళకళ



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ గ్రంథాలయాల్లో కొనసాగుతోన్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు చిన్నారులతో కళకళలాడుతున్నాయి. గురువారం స్థానిక మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు ఎం జగదీశ్వరీ కథలు చెప్పడంతో పాటు వారితో కథలు చదివించారు. బి.హిమాచలేశ్వరీ స్పోకెన్ హిందీపై అవగాహన కల్పించారు. జి.సుబ్బలక్ష్మి జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ నిర్వహించారు. కార్యక్రమాలను రిసోర్స్ పర్సన్స్, అభివృద్ధి కమిటీ సభ్యులు ఇ.పద్మావతి, జి.సంధ్యారాణి, గ్రంథాలయ అధికారి యాగంటి శ్రీదేవి పర్యవేక్షించారు.



మహిళా గ్రంథాలయంలో కథలు చదువుతున్న విద్యార్థులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

రిసోర్స్ పర్సన్ పి.సంతోషకుమారి విద్యార్థులకు పుస్తక పఠనంలో బలరాముడు బలంకలవాడని, శారీరకబలం, బుద్ధిబలం రెండు మనిషికి ఎంతో ప్రాముఖ్యం అంటూ నీతి కథలను బోధించారు. ఏ విషయంలోనైనా అధైర్యపడవద్దని, తమ మెదడును పదునుగా పనిచేయించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు చిన్నచిన్న మట్టికుండలతో గృహాలంకరణ వస్తువులు తయారీలో శిక్షణ అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాం పాషా విద్యార్థులు పాల్గొన్నారు.

తేలని స్త్రీనిధి నిధుల గోల్‌మాల్ వ్యవహారం

గణపవరం: గణపవరం మండలం ముగ్గుళ్ల గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన స్త్రీనిధి నిధులు రూ.36 లక్షల గోల్‌మాల్ వ్యవహారం నెల రోజులు కావస్తున్నా నేటికీ కొలిక్కి రాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సొమ్ము మాయమైందంటూ తొలుత కొందరు మహిళలు చేసిన ఆరోపణలపై నిర్వహించిన ప్రాథమిక విచారణలో రూ.16 లక్షలు వీవోఏ వెంకటలక్ష్మి వాడుకున్నట్లు ఏపీఎం అమీరున్నీసా వెల్లడించారు. దీనిపై గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తాను వాడుకున్న సొమ్మును ఏప్రిల్ 15వ తేదీ లోగా చెల్లిస్తానని హామీ ఇచ్చిన వెంకటలక్ష్మి అప్పటినుంచి నేటివరకూ పరారీలోనే ఉండటంతో బాధితమహిళలు ఆందోళన చెందుతున్నారు. దీనితో మహిళలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును కలిసి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఆయన ఈవిషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత మహిళలకు న్యాయం చేయాలని కోరారు. అయినా ఇప్పటివరకూ తమకు న్యాయం జరుగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వెలగపల్లి గ్రామంలో స్త్రీనిధి నిధులు రూ.15 లక్షల గోల్‌మాల్ వ్యవహారం కూడా ఇంకా కొలిక్కి రాకపోవడంపట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఈవిషయంలో ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

శ్రీవారి సేవలో సీఆర్‌పీఎఫ్ ఐజీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సీఆర్‌పీఎఫ్ ఐజీ విక్రమ్ తుంబళ్ల గురువారం సందర్శించారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు, సూపరింటెండెంట్ రమణరాజు స్వామి వారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. తొలుత ఆయనకు అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయన వెంట భీమడోలు సీఐ యూజే విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంఘీభావం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సంఘీభావం తెలుపుతున్నట్టు యూనియన్ అధ్యక్షులు లింగమల్లు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మల్టీ నేషనల్ కంపెనీలకు కార్మిక వర్గాన్ని తాకట్టు పెట్టవద్దని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు మైచర్ల శంకరరావు, సెక్రటరీ బత్తిన శ్రీనివాసరావు, ఆర్గనైజర్ సెక్రటరీ ఉమా సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం కోరుతూ ప్రచారం

ఈ నెల 20న సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఉదయం కోటదిబ్బ ఎస్‌ఆర్‌వన్ వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఏలూరులో విస్తృత ప్రచార నిర్వహించారు. సమ్మెలో మున్సిపల్ ఉద్యోగ కార్మికులందరూ పాల్గొనాలని నాయకులు కోరారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని, రైతు ఆత్మహత్యలు నివారించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 200 రోజులు పనికల్పించి, రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, నిత్యావసర సరుకుల ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిషోర్, జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



కోటదిబ్బ ప్రాంతంలో సమ్మె విజయవంతం కోరుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

17 నుంచి జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు



నాటిక పోటీల ఆహ్వాన పత్రిక విడుదల చేసిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంబికా సంస్థల వ్యవస్థాపకుడు దివంగత ఆలపాటి రామచంద్రరావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ ఆలపాటి రామచంద్రరావు జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు నెల 17, 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో గురువారం ఆహ్వాన పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, వైఎంహెచ్‌ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రెండు సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారన్నారు. 17న విజయవాడకు చెందిన శ్రీ కృష్ణ తెలుగు థియేటర్స్ అనస్వరం నాటిక, తాడేపల్లి కుంచనపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ విడాకులు కావాలి నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు. 18న హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో అమ్మ చెక్కిన బొమ్మ నాటిక, గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ద్వారబంధాల చంద్రయ్య నాయుడు నాటిక ప్రదర్శిస్తారన్నారు. 19న హైదరాబాద్ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ నా శత్రువు నాటిక, సహృదయ ద్రోణాదుల ఆధ్వర్యంలో వర్క్ ఫ్రం హోం నాటిక, 20న కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ జనరల్ భోగి నాటిక, వీరన్నపాలెం కళానికేతన్ రుతువు లేని కాలం అనే నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. సంస్థ గౌరవ ఆహ్వానితులు వేణుగోపాలునాని, ఎ.పార్వతీ రామచంద్రన్, మారం హనుమంతరావు, కానాల మురళీకృష్ణ, ఎం సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని దీక్షలు

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన హామీ నెరవేర్చాలంటే షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం ఒకటే మార్గమన్నారు. గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతానికి స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఆదివాసీ అగ్రికల్చర్ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగులను స్పెషల్ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మొడియం గంగరాజు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కారం రాఘవ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కుంజం కృష్ణంరాజు, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ నాయకులు తెల్లం శ్రీనుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దొంగతనం కేసు నమోదు

కామవరపుకోట: మేకలు దొంగలించి తీసుకెళుతుండగా వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం అక్కంపాలెం గ్రామానికి చెందిన బల్లె విజయ్ కుమార్ 12వ తేదీ రాత్రి కామవరపుకోట కొత్తూరు సబ్ స్టేషన్ సమీపంలో గల బట్టా సత్యనారాయణ ఇంటి ఆవరణలో ఉన్న 20 మేకల్లో ఒక మేకను దొంగిలించి బుధవారం ఏలూరు వైపు తీసుకువెళుతుండగా తడికలపూడి శివారులో అతడిని పట్టుకుని కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలి

చింతలపూడి: గ్రామంలో తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసంగరాజు ఆదేశించారు. గురువారం చింతలపూడి మండలం, ఎర్రంపల్లి, ప్రగడవరం గ్రామాల్లో ఎస్ డబ్ల్యూ పీసీ షెడ్లను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్త కుప్పలు, పెంట కుప్పలు లేకుండా రోడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వర్మీకంపోస్ట్ ప్రాసెస్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల తనిఖీ

దెందులూరు : దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో పది, ఇంటర్ తరగతులు ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని కే అన్నమ్మ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు వస్తున్న సమయం ఉపాధ్యాయులు శిక్షణ విధానం సమయపాలన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారం విద్యార్థుల ఆసక్తి ఇతర అన్ని అంశాలను ఎంఈఓ అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉత్తీర్ణత పొంది ఉజ్వల భవిష్యత్తు సాధించాలన్నారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎం మల్లికార్జునరావు సైన్స్ టీచర్ గణేష్ గ్రంథపాలకులు వెంకటేశ్వరరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఒన్‌టౌన్ కొత్తగూడెం, కత్తేపువీధి ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుకాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లివారి వీధి, మేకవారి వీధి, కబేల ఏరియా, తూర్పు వీధి శివాలయం ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, కత్తేపు వీధి, దక్షిణపు వీధి, కొత్త గూడెం సెంటర్, గుప్తా ఎంటర్ ప్రైజెస్ ఏరియా, వెంకన్న చెరువు ఏరియా, మార్కండేయ స్వామి గుడి ఏరియా పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. న్నారు.

మాదేపల్లి సెక్షన్ పరిధిలో..

మాదేపల్లిరోడ్, సుంకరివారితోట, ప్రేమాలయం, గాయత్రి నగర్, వెంకటాపురం ఎంపీ రోడ్, జాలిపూడి, లింగారావుగూడెం, కాట్లంపాడు, శ్రీపర్రు, మానూరు, ఎంహెచ్ పురం, కలకుర్రు ప్రాంతాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు (టూటౌన్): స్థానిక జూట్ మిల్ జంక్షన్ సమీపంలో కృష్ణా - ఏలూరు కాలువపై రూ.5 కోట్లతో నిర్మించనున్న నాలుగు వరుసల వంతెన నిర్మాణానికి మంత్రి కొలుసు పార్థసారథి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేస్తామని, దీంతో భవిష్యత్‌లో ఏలూరు నగర అభివృద్ధికి, ట్రాఫిక్ నియంత్రణకు ఎంతో దోహదపడుతుందని మంత్రి అన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ శాశ్వత పటిష్ఠ చర్యలకు రూ.5 కోట్లకు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, పెదబాబు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు కార్నియాల సేకరణ



కోటేశ్వరరావు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన దేసు కోటేశ్వరరావు గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన కార్నియాలను ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (విజయవాడ) ప్రతినిధులు సేకరించారు. వీటితో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగిందని, కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఏలూరుకు చెందిన సామాజిక కార్యకర్త మానేపల్లి రామారావు అన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30-34	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	36	కీరా దోస	38
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	56
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	23
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	29
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	24